క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ రైల్వే స్టేషన్ ఫీడర్ పరిధి లో విద్యుత్ లైన్ల మరమ్మతులు నిమిత్తం శుక్ర వారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విజయవాడ టౌన్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్ణానందపేట, కొత వారి వీధి, బేగ్ స్ట్రీట్, డేవిడ్ స్ట్రీట్, కర్లపాలెం, స్ట్రీట్‌ఖాదర్, స్ట్రీట్‌స్కూల్ వీధి, మంచాల వారి వీధి, గుర్రాల వారి వీధి, పెజ్జోని పేట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి దినత్రయ చతుర్వేద మాస పారాయణం

మధురానగర్(విజయవాడసెంట్రల్):ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు టీటీడీ వేద పారాయణ పథకం ఆధ్వర్యాన ప్రజలు సుభిక్షంగా ఉండాలని అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో దినత్రయ చతుర్వేద మాస పారాయణం నిర్వహించనున్నట్లు పథకం జిల్లా సూపర్‌వైజర్ గుళ్ళపల్లి శివశర్మ శ్రౌతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 25, 26 తేదీల్లో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 7.30 గంటల వరకు, 27వ తేదీన సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు పారాయణం జరుగుతుందన్నారు. వేద పండితులు ఐక్య కంఠముతో శ్రీరుద్రమును పారాయణం చేస్తారని తెలిపారు.

ఇద్దరు బాలురు అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఇద్దరు బాలురు కనిపించకుండా పోయిన ఘటనపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కంసాలిపేటకు చెందిన తమ్మిశెట్టి రమణకుమారికి నలుగురు సంతానం. పెద్ద కుమారుడైన గణేష్ 5వ తరగతి వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటున్నాడు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో గణేష్ స్నేహితుడైన రహీం ఇంటికి రాగా ఇద్దరు కలిసి బయటకు వెళ్లారు. ఎక్కడికి వెళ్లుతున్నారని తండ్రి అడిగినా సమాధానం చెప్పలేదు. సాయంత్రం అయినా ఇద్దరు తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మార్చి 1న సీజ్ చేసిన వాహనాలకు వేలం

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేయబడిన వాహనాల వేలం వచ్చే నెల 1వ తేదీన నిర్వహిస్తామని సీఐ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మునుపటి ధర కంటే తగ్గించి16 వాహనాలకు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేలంలో వాహనాలు పాడుకున్న వారు 18 శాతం జీఎస్టీ రుసుం కట్టాల్సి ఉందన్నారు.

కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో రుణాలు మంజూరు



గుణదల(విజయవాడ తూర్పు): ఖాతాదారులు, వ్యాపారవేత్తలకు సకాలంలో రుణాలు మంజూరు చేయడంలో తమ బ్యాంక్ ముందంజలో ఉందని కెనరా బ్యాంక్ సర్కిల్ కార్యాలయం విజయవాడ జనరల్ మేనేజర్ కె.కళ్యాణి తెలిపారు. గురునానక్ కాలనీలోని కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం రిటైల్ ఉత్సవం పేరిట రుణాలు మంజూరు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఖతాదారులకు మెరుగైన సేవలందించే దిశగా కెనరా బ్యాంక్ కృషి చేస్తుందన్నారు. ఆర్థిక లావాదేవీలతో పాటు రుణాలు మంజూరు చేయటంలో తమ బ్యాంక్ ప్రగతి సాధిస్తుందన్నారు. అతి తక్కువ వడ్డీతో గృహ రుణాలు, వెహికల్ లోన్స్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గృహ నిర్మాణ రంగం అభివృద్ధి సాధించే దిశగా బిల్డర్లకు ప్రాజెక్ట్ లోన్స్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఖతాదారులు, బిల్డర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని కోరారు. అనంతరం రూ.19 కోట్ల 17 లక్షల రూపాయల రుణ మంజూరు పత్రాలను ఖతాదారులకు అందచేశారు. సర్కిల్ డీజీఎమ్ గోపాలనాయక్, రీజనల్ ఆఫీస్ డీజీఎం విజయలక్ష్మి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు పంపిణీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):విద్యార్థులు విలువలు పెంపొందించుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని గురుగోవింద్‌సింగ్ ఫౌండేషన్ చైర్మన్ కులదీప్‌కౌర్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం కేబీఎన్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా కులదీప్‌కౌర్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు అండగా ఉండే లక్ష్యంతో తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపకారవేతనాలు అందిస్తున్నామని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ పేద విద్యార్థులకు గురుగోవింద్‌సింగ్ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. ఈ ఏడాది తమ కళాశాల విద్యార్థులకు సుమారు లక్షాపాతిక వేలు అందించారని వివరించారు.

అధునాతన హంగులతో ఓపెన్ జిమ్‌లు

- ఉచితంగా జిమ్ చేసుకునే వెసులుబాటు
- ఆధునిక వసతులతో ఆహ్లాదకరంగా పార్కులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లో ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అధునాతన హంగులతో పార్కులను అభివృద్ధి చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పచ్చని చెట్లతో చక్కటి ఆహ్లాదకర వాతావరణంలో ప్రజలు ఉదయాన్నే వాకింగ్ చేసుకునేందుకు వీలుగా పార్కులు తీర్చిదిద్దారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి జిమ్ పరికరాలు పార్కుల్లో అమర్చారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఎంతో మంది యువతీ యువకులు, విద్యార్థులు, ఉద్యోగులు వ్యాయామం చేసుకునేందుకు వీలుగా జిమ్ ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే విష్ణు చొరవతో....

గతంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయిన ఉద్యానవనాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఊపిరి పోసుకుంటున్నాయి. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఉద్యానవనాల పట్ల ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు కేటాయించి అభివృద్ధి చేయించారు. అలాగే ఆరోగ్యకర సమాజ స్థాపనకు గానూ ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్‌మార్క్ సెక్టార్ వన్‌లో రూ. 13 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్ నెలకొల్పారు. ఇక్కడ కార్పొరేట్ తరహాలో జిమ్ పరికరాలు అందుబాటులోకి తెచ్చారు. 27వ డివిజన్ దుర్గాపురం వాకర్స్ క్లబ్ ఉద్యానవనంలో రూ. 12.7 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్ పరికరాలను ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. మధురానగర్ లెక్చరర్స్‌కాలనీలో ముత్తవరపు నాగరాజకుమారి ఉద్యానవనంను రూ. 18 లక్షల వ్యయంతో అభివృద్ధి చేయటంతో పాటు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు.



దుర్గాపురం ఉద్యానవనంలో ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న దృశ్యం

కోవిడ్ తరువాత ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధ....

కోవిడ్ తరువాత ప్రజల్లో ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరిగింది. ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం చేయటంతో పాటు వాకింగ్ చేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనికి అనుగుణంగా జిమ్‌ల కోసం వేలాది రూపాయలు ఖర్చుచేసే పనిలేకుండా లక్షలాది రూపాయల వ్యయంతో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసి అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచారు. దీంతో పెద్ద సంఖ్యలో ప్రజలు ఓపెన్ జిమ్‌లకు వచ్చి వ్యాయామం చేసుకుంటున్నారు.

ఉచితంగానే



ఓపెన్ జిమ్‌లో ఆహ్లాదకర వాతావరణంతో పాటు జిమ్‌కు అవసరమైన అన్ని పరికరాలు ఏర్పాటు చేశారు. ఇదే పరికరాలతో జిమ్ చేయాలంటే కనీసం నెలకు పదివేలు ఖర్చు చేయాల్సి ఉండగా ఇక్కడ ఉచితంగా జిమ్ చేయగలుగుతున్నాం.

జి.శేషిరెడ్డి, లోటస్ ల్యాండ్‌మార్క్

హస్త కళలు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక

జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్



ప్రదర్శనను సందర్శించిన జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లేపాక్షి క్రాఫ్ట్ బజార్ ప్రదర్శనలో అలరిస్తున్న హస్త కళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కోరారు. ఆంధ్రప్రదేశ్ హస్త కళాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోగల సిద్దార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి హస్త కళాల ప్రదర్శన లేపాక్షి క్రాఫ్ట్ బజార్ -2023 ను గురువారం జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ప్రాచీన హస్త కళలు మన సంస్కృతి సాంప్రదాయలకు నిదర్శనమని పేర్కొన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలకు చెందిన హస్త కళాకారులు వారి కళా నైపుణ్యంతో వినియోగదారులను ఆకర్షించే విధంగా ఉత్పత్తులను తయారు చేసి ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఎంతో మంది కళాకారులు నేటికి హస్త కళారూపాలకు జీవం పోస్తున్నారని, అటువంటి వారిని ఆదరించి ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశంలోని కర్నాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, రాజస్థాన్, మహారాష్ట్ర, బిహార్, ఒరిస్సా, తెలంగాణ తదితర రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్ లో పేరుగాంచిన హస్త కళా ఉత్పత్తులను ప్రదర్శనలో ఏర్పాటు చేసి అమ్మకాలు నిర్వహించనునట్లు ఆమె తెలిపారు. జాయింట్ కలెక్టర్ వెంట లేపాక్షి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యం విశ్వ, హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ బి. విజయలక్ష్మి, వీవర్స్ సర్వీస్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ అపర్ణ లక్ష్మి, లేపాక్షి అధికారులు సిబ్బంది, వివిధ రాష్ట్రాలకు చెందిన హస్త కళాకారులు తదితరులు ఉన్నారు.

ఈనాడు విషపురాతలు సిగ్గుచేటు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ఈనాడు పత్రికలను దహనం చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):ఈనాడు దినపత్రిక ఒక అబద్దాల ఫ్యాక్టరీ అని... టీడీపీ నాయకుడు పట్టాభి ఉదంతంతో మరోసారి ఆ విషయం తేటతెల్లమైందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైఈనాడు దినపత్రిక, రామోజీరావు చేస్తున్న విషప్రచారానికి నిరసనగా సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని ఎమ్మెల్యే విష్ణు కార్యాలయం ఎదుట ఈనాడు దినపత్రికలను గురువారం దహనం చేశారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ గన్నవరం ఘటనకు సంబంధం లేని ఫొటోలను ప్రచురించి ఈనాడు దినపత్రిక ప్రజల్లో గందరగోళం సృష్టించాలని చూసిందని, ప్రజలకు వాస్తవాలను తెలియజేయాల్సిన బాధ్యతాయుతమైన రంగంలో ఉంటూ ఒక పార్టీకి కొమ్ము కాసేలా విషపురాతలు రాయడం సిగ్గుచేటన్నారు. తప్పుడు ఫొటోలు ప్రచురించి పత్రికా విలువలను రామోజీరావు దిగజార్చారని, రాష్ట్ర ప్రయోజనాలను, అభివృద్ధిని అడ్డుకోవడమనే ఏకైక లక్ష్యంతో ఈనాడు పత్రిక పనిచేస్తుందని ఆరోపించారు. అసత్యపు కథనాలతో ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నించిన రామోజీరావు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, ఉమ్మడి వెంకట్రావ్, అలంపూరు విజయ్, యర్రంశెట్టి అంజిబాబు, ఇసరపు రాజారమేష్, తోపుల వరలక్ష్మి, ఫాతిమా, యక్కల మారుతి తదితరులు పాల్గొన్నారు.

సేవకులను పాలకులుగా చేసిన ఏకైక సీఎం జగనన్న

ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య



మాట్లాడుతున్న యానాదయ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ):వెనుకబడిన కులాలు సమాజానికి వెన్నుముకలని నిరూపిస్తూ నాయీ బ్రాహ్మణులను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని దేవాలయాల పాలకమండళ్లలో స్థానం కల్పిస్తూ వారికి పాలకులుగా అవకాశం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్దవటం యానాదయ్య అన్నారు. విజయవాడలోని బీసీ సంక్షేమ భవన్‌లోగల ఆయన చాంబర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సామాజిక న్యాయాన్ని ప్రతిబింబించే విధంగా బీసీలకు చట్టసభల్లో స్థానం కల్పించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. అలాగే ఎనిమిది రాజ్యసభ సీట్లలో నాలుగు బీసీలకు కేటాయించటం, ఇటీవల ఎమ్మెల్సీలుగా సీఎం జగన్ ప్రకటించిన జాబితాలో 11 మంది బీసీలకు ఇచ్చి వారి పక్షపాతిగా నిలిచారని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వంలో బీసీలకు ఎటువంటి నామినేటెడ్ పదవులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక భద్రత, సామాజిక న్యాయం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెన్నంటే ఉంటూ రానున్న ఎన్నికల్లో 175కి 175 సీట్లు గెలిపించి తీరతామని స్పష్టం చేశారు.

అధికారం ఉంటే ఆయన సామాజికవర్గానికే..

చంద్రబాబు అధికారంలో ఉంటే ఆయన సామాజికవర్గానికే పదవులని, లేని పక్షంలో బీసీలతో కులసంఘాలు పెట్టించి వారితో జెండాలు మోయించటం పరిపాటయిపోయిందని తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో తమ సమస్యలను పరిష్కరించాలంటూ దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులు చంద్రబాబు దగ్గరకు వెళితే తోకలు కత్తిరిస్తానన్న వ్యక్తి వలన సామాజిక న్యాయం జరగదని స్పష్టమైపోయిందన్నారు. అధికారం కోసం చంద్రబాబు ఎంతకైనా దిగజారతాడన్న దానికి ఈనాడులో రాయించిన రోత రాతలే అందుకు నిదర్శనమన్నారు. పాత్రికేయ విలువలు లేని రామోజీకి ఈనాడు జర్నలిజం స్కూల్ నడిపే అర్హత లేదన్నారు. త్వరలో 'జయహో జగనన్న..నీవే మా నమ్మకమన్నా..థ్యాంక్యూ సీఎం సార్' అంటూ నాయీబ్రాహ్మణ కృతజ్ఞతా సభ నిర్వహించనున్నామని చెప్పారు.

ఘనంగా మహాశివరాత్రి ముగింపు ఉత్సవాలు



మహాశివలింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లెనిన్ సెంటర్‌లోని ఓం షిర్డీ నాగసాయి బాబా-నాగమానసాదేవి అమ్మవారి మందిరంలో గురువారం మహాశివరాత్రి ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో మహాశివలింగానికి ప్రత్యేక పూజలు, విభూది అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు కార్యక్రమంలో పాల్గొని మహాశివలింగానికి వివిధ రకాల పూలతో అభిషేకాలు, విభూది అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

మైనార్టీల గురించి మాట్లాడే అర్హత లోకేష్‌కు లేదు

వైఎస్సార్ సీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్



మాట్లాడుతున్న గౌస్‌మొహిద్దీన్

వించిపేట(విజయవాడపశ్చిమ): మైనార్టీల సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లోకేష్‌కు లేదని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్ తెలిపారు. వించిపేటలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వస్తే మైనార్టీలను రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయడంతో పాటుగా ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తానంటు లోకేష్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ హయాంలో ఒక మంత్రిగా మైనారిటీ లేదని, ఇవాళ మైనారిటీలను ఉద్దరిస్తామంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. హిందూపురంలో బాలకృష్ణ సీటు కోసం ఒక సిట్టింగ్ మైనారిటీ ఎమ్మెల్యేకి అన్యాయం చేసిన విషయం అందరికీ తెలుసు అన్నారు. కడపలో తన సొంత మేనమామను సైతం కాదని అంజాద్ బాషాకి సీటు ఇచ్చి, గెలిపించడమే కాకుండా డెప్యూటీ సీఎంను చేసిన చరిత్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. ఆ నాడు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్‌లు కల్పించి అన్ని రంగాల్లో వారికి సముచిత స్థానం కల్పిస్తే ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి అన్ని రంగాల్లో మైనార్టీలకు అండగా నిలుస్తున్నారన్నారు. అటువంటి ప్రభుత్వంలో మైనార్టీల సంక్షేమం గురించి డెప్యూటీ సీఎం అంజాద్‌బాషాను బహిరంగ చర్చకు రావాలంటూ లోకేష్ చాలెంజ్ చేయడం సిగ్గుచేటన్నారు. టీడీపీ హయాంలో ఎంత మంది మైనారిటీలకు రాజకీయంగా మేలు చేశారు..? ఎంత మందికి ఇల్లు, స్థలాలు ఇచ్చారో బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు.

నానో టెక్నాలజీతో ఉపాధి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):నానో టెక్నాలజీలో పట్టు సాధించటం ద్వారా అపారమైన ఉపాధి అవకాశాలను సాధించవచ్చని సెంటర్ ఫర్ నానో అండ్ సెల్ఫ్ మేటర్ సైన్సెస్ (బెంగళూర్) డైరెక్టర్ ఆచార్య బీఎల్వీ ప్రసాద్ అన్నారు. కేబీఎన్ కళాశాల సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకొని నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా నానో టెక్నాలజీ ఆవిష్కరణలపై సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య బీఎల్వీ ప్రసాద్ మాట్లాడుతూ నానో సాంకేతిక పరిజ్ఞానంలో విస్తృతమైన ఆవిష్కరణలు వస్తున్నాయన్నారు. అవి మరింతగా పెరగాల్సిన అవసరముందన్నారు.

నిత్యాన్నదానంకు రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరములో నిర్వహిస్తున్న నిత్యాన్నదానంకు గురువారం దాత వాసు, సుమిత్ర దంపతులు రూ.లక్ష 11 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాత వాసు మాట్లాడుతూ ఇక్కడ మందిరంలో జరుగుతున్న నిత్యాన్నదానంలో తాము కూడా భాగస్వాములవ్వాలనే ఉద్దేశంతో విరాళం అందించామని తెలిపారు. మందిర కార్యదర్శి కుంచనపల్లి రవి మాట్లాడుతూ తాము దాతలు, భక్తుల మనోభావాలకు అనుగుణంగా మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పర్యవేక్షణలో సేవ, అధ్యాత్మికతను రెండు కళ్లుగా చేసుకుని పనిచేస్తున్నామన్నారు. మందిర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మండలపర్తి సత్యశ్రీహరి మందిర సభ్యులు తదితరులున్నారు.

సంక్షేమ పథకాలతో కొండంత అండ

గడప గడపకు మన ప్రభుత్వంలో లబ్ధిదారులు



సంక్షేమ పథకాల అమలు గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):'రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవడం రాష్ట్ర ప్రజలు చేసిన అదృష్టం... చదువుకునే పిల్లల దగ్గర నుంచి పండు ముసలి వాళ్ల వరకు జగనన్న కొండంత అండగా నిలుస్తున్నారు... వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా నా ఒక్క కుటుంబంలోనే రూ.87,535 లబ్ధి చేకూరింది... నా జీవితంలో ఇటువంటి మంచి ప్రభుత్వాన్ని ఎప్పుడు చూడలేదు...' అని 58వ డివిజన్ సింగ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీకి చెందిన అల్లాడ శోభ శ్రీదేవి అనే మహిళ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సింగ్‌నగర్ 58వ డివిజన్‌లోని 259వ వార్డ్ సచివాలయ పరిధిలో గురువారం జరిగింది. ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజలు డివిజన్‌లోని స్మైల్ హాస్పటల్ రోడ్డు, పీఅండ్‌టీ కాలనీల్లోని 133 గడపలను సందర్శించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. స్మైల్ హాస్పటల్ సమీపంలో నివసిస్తున్న షేక్ జిలాని మాట్లాడుతూ పేద ప్రజలందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ చేయూత, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ సున్న వడ్డీ పథకాల ద్వారా తమ కుటుంబానికి జగనన్న ప్రభుత్వం రూ.45,181 ఆర్థిక సహాయాన్ని అందించిందని సంతోషం వ్యక్తం చేశారు. పీఅండ్‌టీ కాలనీకి చెందిన శ్రీనివాసరావు, నళిని, కుమార్‌రెడ్డి అనే వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. దోమల బెడద అధికంగా ఉంటుందని, రాత్రుల సమయంలో అస్సలు ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని వాపోయారు. ఎమ్మెల్యే విష్ణు సంబంధిత మలేరియా విభాగం అధికారులను పిలిపించి సమస్యాత్మక ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నాగుల్‌మీరా, ఫాతిమా, రాంబాబు అనే వ్యక్తులు మాట్లాడుతూ కాలువలు సరిగా తీయడం లేదని, పాఠశాలల వద్ద ఆకతాయిల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరడంతో ఎమ్మెల్యే విష్ణు వెంటనే శానిటరీ, పోలీసు అధికారులను పిలిపించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకున్నారు. కార్పొరేషన్ డీఈలు గురునాథం, రామకృష్ణ, సీడీఓ జగదీశ్వరీ, వైఎస్సార్‌సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, తోపుల వరలక్ష్మి, బొందిలి శైలజ, క్రాంతి, శ్యామ్, అశోక్, వసంత్, రాము, గోపిరెడ్డి, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో నిధులన్నీ దారి మళ్లింపు

- కనకదుర్గ ఫ్లై ఓవర్ కింద జంక్షన్ల అభివృద్ధికి కేటాయించిన నిధులు వాటర్‌స్పోర్ట్స్‌కు తరలింపు
- 2018-19 ఆడిట్‌లో వెలుగులోకి వచ్చిన పలు నిర్వాకాలు
- ఆయా విభాగాలపై 218 అభ్యంతరాలను లేవనెత్తిన ఆడిట్
- వారంలోగా తమకు నివేదిక ఇవ్వాలని సర్క్యులర్ జారీ



విజయవాడ నగర పాలక సంస్థ కార్యాలయం

పటమట(విజయవాడతూర్పు):గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ నగర పాలక సంస్థలోని పలు విభాగాలు అవకతవకలకు పాల్పడినట్లు తమకు సందేహాలు ఉన్నాయని స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ సందేహం వ్యక్తం చేసింది. ఇటీవల వీఎంసీ ప్రధాన కార్యాలయంలో, సర్కిల్ కార్యాలయాల్లో 2016-17, 2017-18, 2018-19, 2019-20, 2020-21 సంవత్సరాల పద్దులుపై ఆడిట్ నిర్వహించింది. ఇందులో అత్యధికంగా 2018-19లో అత్యధికంగా తమకు సందేహాలున్నాయని వీటిని వెంటనే తీర్చాలని కమిషనర్‌ను కోరింది. ఆయా విభాగాల నుంచి మొత్తం 218 అభ్యంతరాలను వీఎంసీ అధికారుల ముందు ఉంచింది. తమ అభ్యంతరాలను వారంలోగా ఇవ్వాలని ఆడిట్ వీఎంసీ కమిషనర్‌కు సూచించింది.

ప్రధాన అభ్యంతరాలు....

- వన్‌టౌన్ ఏరియాలో ఉన్న గాలిబ్ హజతర్ దర్గాకు చెందిన స్థలంలో 2016-19 వరకు వివిధ రకాల వ్యాపార కార్యకలాపాలు జరిగాయి. దీనికి సంబంధించి సోమాకన్‌స్ట్రక్షన్ కార్యకలాపాలు కూడా జరిగాయి. ఆయా సంవత్సరాల్లో ఈ సోమా సంస్థ రూ. 3.5 కోట్లు ఖాళీ పన్ను చెల్లించాల్సి ఉన్నా చెల్లించలేదని దీనిపై సమాధానం ఇవ్వాలని ఆడిట్ విభాగం కోరింది.
- 2017-18 ఆర్థిక సంవత్సరంలో విజయవాడ నగరంలో మొత్తం 16,747 నూతనంగా ఇంటి పన్నులు విధించారు. అయితే తాము 174 ప్రాపర్టీలను పరిశీలిస్తే అందులో 44 ప్రాపర్టీలకు పెనాల్టీ షార్ట్ లెవీకింద రూ. 99 లక్షలు విధించాల్సి ఉన్నా ఎందుకు విధించలేదని ప్రశ్నించారు
- పట్టణ ప్రణాళిక విభాగం భవన నిర్మాణ అనుమతులు ఇచ్చే సమయంలో ఖాళీ స్థలాల పన్నులను పరిగణలోకి తీసుకోలేదు. దీనివల్ల వీఎంసీకి రూ. 9.35 కోట్ల ఆదాయం సమకూరలేకపోయింది. ఇందుకు గల కారణాలను వివరించాలని కోరింది.
- కనకదుర్గ ఫ్లైఓవర్ దిగువన జాతీయ రహదారుల విభాగం ఆయా పనులకు రూ. 40 కోట్లు వీఎంసికి అందిస్తే 24 పనులకు రూ.35.38 కోట్లు అంచనాలు వేశారు. అయితే నాలుగు పనులకు రూ.7.74 కోట్లు అంచనాలు రూపొందించి వాటిని వినియోగించినట్లు రికార్డులు చూపారు.

ఏయే పనులకు వినియోగించారో సమస్త సమచారం ఇవ్వాలని ఆడిట్ కోరింది. ఈ నిధులతో అప్పట్లో కృష్ణానదిలో వాటర్ స్పోర్ట్స్‌కు వినియోగించాలని అప్పటి ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి చేయటంతో నిధుల దారిమళ్లింపు జరిగిందని అప్పట్లో పెద్ద దుమారమే రేగింది.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



శంకుస్థాపన చేస్తున్న మంత్రులు తానేటి వనిత, బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు

విజయవాడరూరల్: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రులు తానేటి వనిత, అంబటి రాంబాబు, బొత్స సత్యనారాయణ తెలిపారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 64వ డివిజన్ కండ్రిక జంక్షన్ వద్ద రూ.3.65 కోట్ల వ్యయంతో నూజివీడు రోడ్ల అభివృద్ధి పనులకు, 62వ డివిజన్ ఎల్‌బిఎస్ నగర్‌లో కోటి రూపాయల వ్యయంతో నిర్మించే కమ్యూనిటీ హాల్‌కు గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం 58వ డివిజన్ లో రూ.1.06 కోట్లతో నిర్మించిన అర్బన్ ప్రైమరీ సెంటర్‌ను ప్రారంభించారు. రాజరాజేశ్వరీపేటలో పేదలకు రిజిస్ట్రేషన్ రాయితీని కల్పిస్తూ ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. పేద వర్గాలకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. . బసవతారకనగర్, సుబ్బరాజనగర్, అంబేద్కర్‌నగర్‌కు చెందిన మరో 500 మందికి ఇళ్ల పట్టాలను త్వరలో రిజిస్ట్రేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజారెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బాక్సింగ్ చాంపియన్ విక్రమ్ నాయుడుకు కలెక్టర్ అభినందన



బాక్సింగ్ చాంపియన్ విక్రమనాయుడును అభినందిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యూనివర్సల్ బాక్సింగ్ ఆర్గనైజేషన్ సూపర్ ఫెదర్ వెయిట్ అంతర్జాతీయ బాక్సింగ్ చాంపియన్ విక్రమ నాయుడు కలెక్టర్ కార్యాలయంలో గురువారం కలెక్టర్ ఢిల్లీరావును కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విక్రమ నాయుడును ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరానికి చెందిన విక్రమ నాయుడు అంచెలంచెలుగా ఎదిగి బాక్సింగ్ చాంపియన్ షిప్ గెలవడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్న పతకాలు సాధించాలన్నారు. ప్రతిభగల క్రీడాకారులను జిల్లా యంత్రాంగం తోడ్పాటు నందిస్తుందన్నారు.